2024 పాఠకులకు, ప్రకటన కర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024

అభివృద్ధి చేసి చూపుతాం


దాసేగౌనూరులో చీరలు పంపిణీ చేస్తున్న దుర్గ

కుప్పం రూరల్: ఎమ్మెల్సీ భరత్‌ను రాబోవు ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే అభివృద్ధి ఏమిటో చేసి చూపుతామని ఆయన సతీమణి దుర్గ అన్నారు. ఆదివారం మండలంలోని దాసేగౌనూరు పంచాయతీలో మహిళలకు పసుపు, కుంకుమ, చీర, గాజులు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉండే వ్యక్తికి 35 ఏళ్లుగా గెలిపిస్తున్నారని, స్థానికంగా ఉండే భరత్‌కు ఈసారి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, సింగిల్ విండో చైర్మెన్ తిమ్మోజీగాడు, నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



పలమనేరు: పట్టణ ద్విచక్రవాహనాల అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా మహబూబ్‌ను సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఆనంద్, కార్యదర్శిగా అక్బర్, కోశాధికారిగా మురళి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు వారు తెలిపారు. మున్సిపాలిటీలో మెకానిక్ షెడ్ల కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మీయంగా..ఆప్యాయంగా..

పలమనేరు : ఎమ్మెల్యే వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, రాజంపేట పరిశీలకులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, పలమనేరు మునిసిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, మండీ సుధ తదితరులు ఆదివారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. అలాగే ఎమ్మెల్యే మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖశాంతులతో ఉండాలని శుభాకాంక్షలు చెప్పారు. ఇక పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలు ఆలయాలు 'నూతన' వేడుకలకు ముస్తాబయ్యాయి. బేకరీలు, పూల దుకాణాలు, రంగుల దుకాణాలు రద్దీతో కనిపించాయి.


మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేతలు

అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ

పలమనేరు: పట్టణంలోని రోడ్లపక్కన ఉంటున్న నిరాశ్రయులు, అభాగ్యులకు ఆదివారం రాత్రి స్థానిక సమాజ సేవకుడు మోహన్ పదిమందికి దుప్పట్లను పంపిణీ చేశారు.





మంగళగిరిలో లోకేష్ ఓటమి తథ్యం


బసవరాజుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సదుం: మంగళగిరిలో లోకేష్ ఓటమి చెందడం తథ్యమని అదే మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు బసవరావు పేర్కొన్నారు. వై నాట్ 175లో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయకు ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర ఆదివారం సదుంకు చేరింది. స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్‌విండో వైస్ ప్రెసిడెంట్ రమేష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


నియామకం


జయరాం


చెంగారెడ్డి

పుంగనూరు: వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ, మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ ఆదివారం రాష్ట్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ అధ్యక్షుడిగా గంగారపు జయరాం, మండల అధ్యక్షుడిగా కొత్తపల్లె చెంగారెడ్డి, చౌడేపల్లె అధ్యక్షుడిగా కె.అంజిబాబు, సోమల అధ్యక్షుడిగా ఎం.గంగాధరం, సదుం అధ్యక్షుడిగా సి.రెడ్డెప్పరెడ్డి, పులిచెర్ల అధ్యక్షుడిగా చెరుకూరు నాదమునిరెడ్డి, రొంపిచెర్ల అధ్యక్షుడిగా ఆర్.ఇబ్రహీంఖాన్‌తో పాటు కమిటీ సభ్యులను ఆయా మండలాలకు నియమించారు.

ముచ్చటగా మూడోసారి..


రమణ

పుంగనూరు: రాష్ట్ర పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన జీవి.రమణ మూడవసారి ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వేడుకగా 'లయన్స్ క్లబ్' చిల్డ్రన్స్ ఫెస్టివల్


నృత్యం చేస్తున్న చిన్నారి

పుంగనూరు: నూతన సంవత్సరం పురస్కరించుకుని పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆదివారం రాత్రి స్థానిక అక్షర పాఠశాలలో చిల్డ్రన్స్ ఫెస్టివల్‌ను క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ ఆధ్వర్యంలో నిర్వహించింది. ముఖ్యఅతిథులుగా కమిషనర్ నరసింహప్రసాద్, సీఐ రాఘవరెడ్డి మాట్లాడారు. చిన్నారుల భరతనాట్యం, కూచిపూడి, యోగా, పాటల పోటీలు పలువురినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకూ సేవల విస్తరణ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాలకూ తమ సేవలు విస్తరిస్తున్నట్టు మానవత స్వచ్ఛంద సంస్థ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం కార్యదర్శి నారాయణ, చైర్మన్ నందీశ్వరయ్య ఆధ్వర్యంలో కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇప్పటి వరకు పట్టణంలో ఎవరైనా చనిపోతే వారికి ఫ్రీజర్ బాక్సులు ఇస్తున్నామని, శాంతిరథం, పార్కుల్లో బెంచీలు, మొక్కలు ఉచితంగా ఇస్తున్నామన్నారు. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, నాయకులు

పలమనేరు: యూటీఎఫ్ డైరీలు, క్యాలెండర్లను డివిజన్ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర కౌన్సిలర్ సీపీ ప్రకాష్, ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ మార్గదర్శిని పుస్తకాన్ని ఆసంఘ నాయకులు గురుమూర్తి తదితరులు ఆవిష్కరించారు.





























